హలో.. మీ పార్సిల్ వచ్చింది!



పెరిగిన ఆన్‌లైన్ వ్యాపారం

డెలివరీ బాయ్స్‌కు పెరిగిన ఆదరణ

మండలంలో 200 మందికి ఉపాధి

ట్రింగ్.. ట్రింగ్..
కస్టమర్: హలో...!
డెలివరీ బాయ్: మీకు పార్సిల్ వచ్చిందండి..
కస్టమర్: ఎక్కడ నుంచి...
డెలివరీ బాయ్: టిఫిన్ బుక్ చేశారు కదా..!
కస్టమర్: హ.. అవును ఎక్కడ ఉన్నారు..
అది వేకువ జాము అయినా.. అర్ధ రాత్రి అయినా అన్నీ ముంగిటకే తెచ్చింది ఆన్‌లైన్ వ్యాపారం. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.



పార్సిళ్లతో డెలివరీకి సిద్ధంగా..

పెదగంట్యాడ: ఆన్‌లైన్ వ్యాపారం విస్తృతం అయింది. గుండు సూది నుంచి గెడ్డ పార వరకు.. ఉప్పు నుంచి పప్పు వరకు.. దుస్తుల నుంచి మంచాలు, పరుపుల వరకు.. కాస్మోటిక్స్, హోమ్ నీడ్స్, మెడికల్, కిరణా, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుడ్ ఐటమ్స్ అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడం.. ఇంట్లో నుంచే మొబైల్ ద్వారా వాటిని ఆర్డర్ చేయడం రోజురోజుకూ పెరుగుతోంది. వాటిని డోర్ డెలివరీ చేసే అమెజాన్, ఈ-కార్ట్, ఈ.కామ్, డెలివరీ, స్విగ్గీ, జొమోటో తదితర సంస్థలు తమ వ్యాపారాలను విస్తరిస్తున్నాయి. మండలంలో వీటికి సంబంధించిన బ్రాంచీలు ఏర్పాటు చేయడంతో ఆయా సంస్థల్లో పని చేసేందుకు డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ ఏర్పడింది.

పెరిగిన ఆర్డర్లు

ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెరగడంతో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు డిమాండ్ కూడా పెరిగింది. గతంలో పార్సిళ్ల డెలివరీపై అంతంత మాత్రంగానే కమిషన్ ఉండడంతో అప్పట్లో ఈ ఉద్యోగాల కోసం పెద్దగా ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. కానీ ఇప్పుడు లోకల్, లాంగ్ రూట్‌ల ప్రకారం ఒక్కో పార్సిల్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు కమీషన్ ఇస్తున్నాయి. ప్రతి వారం వీరికి పేమెంట్ చేయడంతో నెలకు రూ.20 వేల నుంచి రూ. 30వేల వరకూ సంపాదించుకోవచ్చని ఆయా సంస్థలు నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నాయి. డెలివరీ బాయ్స్‌కు బైక్, డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరి.



30కి పైగా..

మండలంలో సుమారు 200 మందికి పైగా డెలివరీ బాయ్స్‌గా, ఏజెంట్లుగా పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అధిక శాతం మంది ఫుల్‌టైమ్ కొంత మంది ఖాళీ సమయాల్లో పార్ట్‌టైమ్ చేస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 వరకూ పార్సిళ్లను డెలివరీ చేయడం ద్వారా ప్రతి నెలా రూ.20 వేలకు పైగా సంపాదిస్తున్నారు.



బ్యాగు నిండా పార్సిళ్లతో..

పార్ట్‌టైమ్ అవకాశాలు

ఒకప్పటిలా రెస్టారెంట్‌కు వెళ్లి తినడం, పార్సిల్ తెచ్చుకుందామా.., డిపార్టుమెంట్ స్టోర్లకు వెళ్లి సామగ్రి కొనుగోలు చేయడం, పార్సిల్ తెచ్చుకోవడం కంటే ఇప్పుడు చాలా వరకూ ఆన్‌లైన్ ఆర్డర్లకే మొగ్గు చూపుతున్నారు. దీంతో డెలివరీ సంస్థల సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరించాయి. పాకెట్ మనీ కోసం విద్యార్థులు డెలివరీలు చేస్తుండగా.. డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా డిగ్నిటీ ఆఫ్ లేబర్ కింద డెలివరీ బాయ్స్ అవతారాలు ఎత్తుతున్నారు.

బిజినెస్ ఆఫ్ లైన్ యాప్ ఆవిష్కరణ

రిటైల్ వ్యాపారస్తులకు హోల్‌సేల్ ధరలకే దుస్తులు, పాదరక్షలు అందించేందుకు అనువైన బిజినెస్ ఆఫ్ లైన్ యాప్‌ను రూపొందించారు సుయాష్ జైన్, తరుణ్ గుప్తా. రిటైలర్లు పెద్ద మొత్తం స్టాకు తీసుకొచ్చి నిల్వ చేసుకునే అవసరం లేకుండా ఆర్డర్ పెట్టిన గంటలోనే డెలివరీ చేయనున్నారు.



పార్సిల్ డెలివరీ చేస్తూ..

ఎండైనా.. వానైనా..



నేను ఏడాది నుంచి డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాను. ఆర్డర్లు సూచించిన సమయానికి డెలివరీ చేయాలి. అందుకే ఎండైనా.. వానైనా.. ఉరుకులు పరుగులు పెడుతూ పార్సిళ్లను అందజేస్తాం. డెలివరీ చేసిన సమయంలో ఆర్డర్ పెట్టిన వారు కాంటాక్ట్ నెంబర్ సరిగా ఇవ్వకపోవడంతో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

–బొడ్డు సాయి మురళీకృష్ణ, పెదగంట్యాడ


సకాలంలో అందిస్తేనే..



నేను రెండున్నరేళ్లగా డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాను. ప్రతి రోజూ 40 నుంచి 50 వరకు పార్సిల్ చేస్తున్నాను. ఆర్డర్ పెట్టిన వారికి సమయానికి వాటిని అందజేస్తేనే సంతృప్తి ఉంటుంది. దానికి తగిన కమిషన్ వస్తుంది. లేకపోతే ఎంత తిరిగినా ఫలితం ఉండదు.

–కాసారపు రాజేష్, గంగవరం

త్రిశక్తి దేవాలయంలో రుద్రశ్యామల పూజలు



విశేష అలంకరణలో మహాదుర్గ అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో శనివారం రుద్రశ్యామల పూజలు చేశారు. శ్యామలా (గుప్త) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శత్రుభయ నివారణ, భయంకర విపత్తుల నివారణ కోసం అమ్మవార్లకు పూజలు చేశారు. అంతకు ముందు వేకువ జామున శ్రీమహాదుర్గ, మహాసరస్వతి, మహాదుర్గ అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ తెలిపారు.

వైభవంగా సహస్ర నామార్చన



సహస్ర నామార్చన నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం వేకువ జామునే స్వామికి సుప్రభాత సేవ, తోమల సేవ నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో అంగరంగ వైభవంగా వేలాదిమంది భక్తుల నడుమ సహస్ర నామార్చన నిర్వహించారు. .

విరాళాల అందజేత

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన మూలనిధికి దాతలు విరాళాలు అందజేశారు. అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జి.నాగరాజు, నేలవేణి దంపతులు రూ.10,116లు, ఎన్ఏడీకి చెందిన కంటిపూడి దేవ్ కుమార్, మంగాదేవి దంపతులు శ్రీవారికి మేల్ ఛాట్ వస్త్రాలు, అమ్మవార్లకు పట్టు చీరలు అందజేశారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్‌వోబీ పనులు



ఆటోనగర్ ఎఫ్ - బ్లాక్ వైపు పిల్లర్స్ నిర్మాణ పనులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు జోరుగా సాగుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా వడ్లపూడి క్యాబిన్ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై మాత్రమే బ్రిడ్జి నిర్మించి వదిలేశారు. ఎట్టకేటకు బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధుల మంజూరు అవడంతో పనులు ప్రారంభమయ్యాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐలా అధికారులను వాహన చోదకులు కోరుతున్నారు.

సామూహిక ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న మాస్టర్ నరేంద్ర

పెదగంట్యాడ: స్థానిక అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సొసైటీ అధ్యక్షుడు మీసాల శివగణేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరేంద్ర సామూహిక ఆత్మ జ్ఞాన ధ్యానం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. శ్వాస మీద ధ్యాసపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం అందరితో కలసి సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం సభ్యులు వనిత, అప్పలరాజు, దేవిక, లక్ష్మి, తులసి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారుమాంబ జాతర నేడు



బంగారు మాంబ అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారు మాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. వేకువ జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహానంది అవార్డుకు ఆర్టీసీ డ్రైవర్‌ఎంపిక



జాజుల అప్పారావు

అగనంపూడి: కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక సంయుక్తంగా ప్రకటించిన మహానంది అవార్డు అగనంపూడికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి, జానపద, బుర్రకథ, చిత్రలేఖనం వంటి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న జాజుల అప్పారావుకు దక్కింది. ఈమేరకు సంస్థ జాతీయ చైర్మన్ రాజ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించనున్న స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో ఈ అవార్డును అప్పారావు అందుకోనున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



శంకర్ రెడ్డికి నగదు అందజేస్తున్న సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు శనివారం ఆయన్ను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

అగనంపూడి: చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. 79వ వార్డు అగనంపూడిలోని కేఎస్ఎన్‌నగర్ (ఉప్పరకాలనీ)లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న ఆహార ప్యాకెట్లు, పాలు, గుడ్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. బాలలు, సిబ్బంది హాజరు పట్టీనీ పనిశీలించి పలు సూచనలు చేశారు. బాలలకు అందించే పౌష్టికాహారంలో విషయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, సమయ పాలన పాటించాలని, పిల్లల హాజరు విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా బాలలతో ముచ్చటించారు. వారిని కుశల ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆయనతోపాటు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ద్రోణంరాజు శ్రీనివాస్‌కు నివాళి



శ్రీనివాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ సేవలు మరువలేమని గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పెదగంట్యాడ పార్టీ కార్యాలయంలో ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లా చినతల్లి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మాల శ్రీనివాసరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, మంత్రి శంకరనారాయణ, వెంపాడ అప్పారావు, అండిబోయిన అప్పారావు, వెంకటేష్, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు పూర్ణను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అగనంపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి అందర్నీ కలుపుకొని పనిచేస్తానని ఆ పార్టీ విశాఖ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా 79, 85 వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం అయినప్పు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి చిన అప్పారావు, సేనాపతి నరసింగరావు, దాము రోతు అప్పలరాజు, యలమంచిలి వరహా వెంకటరావు, దాసరి సన్యాసిరావు, యలమంచిలి కృష్ణ ప్రసాద్, కరణం సంతోష్‌కుమార్, తోకాడ చంద్రమౌళి, గొంతిన హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి



శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పులి వెంకటరమణారెడ్డి కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం శనివారం నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులు బకాయిలతో పాటు ప్రతీనెలా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. పోరాట, పరిరక్షణ కమిటీ చేపట్టే ఉద్యమాలకు నిర్వాసితులు సహకారం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.సన్యాసిరావు, ఎం. గోపి, శ్రీనివాస్, ఎం.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పట్టు సాధిస్తే అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

గాజువాక: జీవితంలో అత్యున్నత అవకాశాలను సొంతం చేసుకోవడానికి ఆంగ్లభాష దోహదం చేస్తుందని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంగ్లిష్ ఫియస్టా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగ్ల భాషను విద్యార్థి దశనుంచే నేర్చుకోవడం వల్ల ఉన్న ఉపయోగాలను వివరించారు. పూజా ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మంచి భవిష్యత్తును పొందడానికి అవసరమైన నైపుణ్యాలను ఇంగ్లిష్ ద్వారా సాధించగలరన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి



కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గాజువాక: ప్రతి విద్యార్థి ఏదో ఒక ప్రతిభ కలిగి ఉంటాడని, దాన్ని గుర్తించి అందులో రాణించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫ్లోరెసెన్స్ - 2025 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ బిడ్డ డాక్టర్ కావాలని, ఐఐటీలో చదవాలని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారన్నారు. తెలుగుభాషకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మాతృభాషలో మాట్లాడాలని కోరారు. తమ బిడ్డ ఏ రంగంలో నైపుణ్యాన్ని కలిగి ఉన్నాడో గుర్తించి అందులో రాణించేందుకు ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రి రిజర్వాయర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి



శివరాం మృతదేహం

పెందుర్తి: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. గాజువాక నాతయ్యపాలేనికి చెందిన దేవవరపు శివరాం (28) శనివారం మధ్యాహ్నం మేహాద్రి రిజర్వాయర్ వద్దకు వచ్చాడు. తన బంధువులకు ఫోన్ చేసి మేహాద్రి వద్ద బైక్ ఉంది తీసుకోండి అని చెప్పిన తరువాత ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కాగా, సాయంత్రం మేహాద్రిలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అతడ్ని శివరాంగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. శివరాం ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ప్రజా పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ మనుగడ

- నెల్లూరు చేరిన ఉద్యమ జ్యోతి



స్టీల్‌ప్లాంట్ ఉద్యమ జ్యోతిను బీవీ రాఘవులుకు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు

ఉక్కునగరం: ప్రజా పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యమని, ఆ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ, బీవీ రాఘవులు అన్నారు. గత నెల 28న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమ కేంద్రం నుంచి బయలుదేరిన ఉద్యమ జ్యోతి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి శనివారం నెల్లూరులో జరిగిన సీపీఎం రాష్ట్ర మహా సభలో విశాఖ ఉక్కు రక్షణకు జరిగే పోరాటాన్ని ప్రజలకు వివరిస్తూ ఆ జ్యోతిని వారికి అందజేశారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజా పోరాటాలను ఉధృతం చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి మరింత పెంచాలన్నారు. భావితరాలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే ప్రభుత్వ రంగాన్ని రక్షించడం ద్వారానే సాధ్యపడుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఖనిజాన్ని కేటాయించడం ద్వారా ఉత్పత్తి అంతరాయాలు తగ్గి లాభాలు ఆర్జిస్తుందన్నారు. ఉద్యమ జ్యోతిను స్టీల్‌ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు సీపీఎం స్టీల్ డివిజన్ నాయకులు యు. రామస్వామి, బి. మహేష్, జి. శ్రీనివాసరావు, గురప్ప, సోమేశ్ తీసుకువెళ్లారు.

కక్షిదారుల సందేహాలను నివృత్తి చేయాలి



షీలానగర్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ బాలకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ బాలకృష్ణ శనివారం షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ రిజిస్ట్రార్ తారకేష్ నుంచి పలు వివరాలు సేకరించారు. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీల దృష్ట్యా కార్యాలయంలో గత మూడు రోజులుగా జరిగిన రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. పెరిగిన రిజిస్ట్రేషన్ విలువలపై వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

నేడు వ్యాకులమాత మహోత్సవం



పాదయాత్రను ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం: విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండ డాబాలకు చెందిన వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం అధ్వర్యంలో కొండ డాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర..

జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకన వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో పలువు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజనం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించారు. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులు ఏర్పాటు చేసింది.

బాలబాలికల వైద్యం కోసం ప్రత్యేక వాహనం

మహారాణిపేట : రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలబాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రవేశ పెట్టిన ప్రత్యేక వాహనాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 0–19 ఏళ్లలోపు బాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నవారిని గుర్తించి, వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తరలించే నిమిత్తం ఈ ప్రత్యేక వాహన సదుపాయం కల్పించామన్నారు. ముందుగా నిర్ణయించిన నిర్ణీత సమయాల్లో ఆయా ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ వైద్యాధికారులు నిర్ధారించిన బాలబాలికలను డీఈఏసీ సెంటర్‌కు తరలిస్తుంది. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హారిక, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డీమో) బి.నాగేశ్వరరావు, ఇ.శాంతిప్రియ, డీఈఐసీ మేనేజర్ మోహన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.